# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## కేంద్ర కమిటి

**పత్రికా ప్రకటన**

### పోలీసు, అర్ధసైనిక బలగాలకు మా విజ్ఞప్తి!

### దోపిడీదారుల కోసం మీ ప్రాణాలను ఫణంగా పెట్టకండి!

### మీరు గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగం కాకండి! ప్రజల ప్రాణాలను కాపాడండి!

పోలీసు, అర్ధసైనిక బలగాల్లో చేరిన మీరంతా ఒక్కసారి ఆలోచించండి. మీ కుటుంబ పరిస్థితులను, మీ నేపథ్యాన్ని గుర్తు చేసుకోండి. మీరు ఖాకీ డ్రస్సు వేసుకొని, తుపాకులు మోస్తున్నప్పటికీ మీరు కింది స్థాయి సైనిక వృత్తిలో ఉన్నారు. మీరు దళిత, ఆదివాసీ, పేద కార్మిక, కర్షక కుటుంబాల నుంచే ఈ వృత్తిలోకి వచ్చారన్నది కాదనలేని సత్యం. మీరు రాష్ట్ర బలగాల్లో ఉన్నా, కరుడుగట్టిన కమాండోలుగా పిలవబడుతున్నా, అర్ధ సైనిక బలగాల్లో గానీ, సైన్యంలో గానీ మీరు ఎక్కడ కొలువు చేస్తున్నా మీ జీవిత పరమార్థం ఏంటో లోతుగా, నిజాయితీగా ఆలోచించండి. మీ సేవలు ఎవరి వికాసానికి అంకితమవుతున్నాయో చూడండి. మీరు మీ కుటుంబాల పోషణకోసం ఏ బతుకు తెరువు లేని కోటానుకోట్ల నిరుద్యోగులుగా కాలం గడపలేక తుదకు పొట్టకూటి కోసం పోలీసులయ్యారన్నది మీకు తెలవనిది గాదు. మీరు పోలీసులు కావడం నిజంగా మీ అంతరాత్మ ససేమిరా అంగీకరించడం లేదు అని మాకూ తెలుసు. మీరు విప్లవోద్యమ ప్రాంతాలలోకి కొలువు కోసం వస్తున్నారంటేనే మీ కుటుంబీకులు గంపెడు దుఃఖంతో గుండెలు బాదుకుంటున్న విషయం మీరు కాదనగలరా! మీలో ఏవో కొన్ని లంపెన్ శక్తులు తప్ప నిజాయితీపరులెవరూ మనస్ఫూర్తిగా పోలీసు ఉద్యోగాలు చేయడం లేదన్నది మాకు తెలుసు. ఫలితంగానే మా ఉద్యమ ప్రాంతాలలో డ్యూటీలో చేరకుండా పోతున్నవారి సంఖ్య మూడో వంతుకు మించే ఉంటుందన్నది మీకు తెలియనిది కాదు. మీ అధికార్లు, మంత్రులు ఎన్ని తాఖీదులిస్తున్నా డ్యూటీలో చేరకుండా పోతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వారీ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతల నిర్వహణ పట్ల గల విముఖతతోనే విధుల్లో చేరడం లేదన్నది గమనార్హం. అందుకే మేం, 'పోలీసులారా! మీరూ పేదలే' నంటూ నినదిస్తాం. మీరూ పేద ప్రజల న్యాయమైన పోరాటాలలో భాగమై, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలనీ మా పార్టీ పిలుపునిస్తోంది. విశాల ప్రజారాశుల పక్షాన నిస్వార్థంతో, అంకితభావంతో నిలిచి పోరాడుతోన్న మా పిఎల్‌జిఏను ఆదర్శంగా తీసుకోండి.

మీకు మీ పోలీసు ఉన్నత అధికారులు, లుచ్ఛా రాజకీయ నాయకులు కల్లబొల్లి మాటలతో తప్పుడు దేశభక్తిని మెదడుకు ఎక్కిస్తున్నారు. మావోయిస్టులు దేశ అంతరంగ భద్రతకు పెనుముప్పంటూ ఊదరగొడుతున్నారు. మావోయిస్టులు ఉగ్రవాదులంటూ, దేశ ద్రోహులంటూ, సంఘ వ్యతిరేకశక్తులంటూ మీరు ఏమాత్రం ఊహించని విధంగా మా మీద బురదచల్లుతూ మీ బుర్రలను పాడు చేస్తున్నారు. ఈ దేశంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతోన్న అన్ని సెక్షన్ల ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి మీ ఉన్నతాధికారులు, లుచ్ఛా రాజకీయ నాయకులు మిమ్మల్ని రెచ్చగొట్టి రంగంలోకి దించుతారు. కశ్మీర్ ప్రజలు పోరాడుతూంటే వారిని పాకిస్థాన్ ప్రేరేపిత శక్తులుగా చిత్రించి మీలో అణువణువునా ద్వేషాన్ని నింపుతున్నారు. ఈశాన్య ప్రాంత ప్రజల పోరాటాల విషయంలోనూ అంతే! కానీ ఒక్కసారి ఆలోచించండి. అక్కడ దశాబ్దాలుగా సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని చేతపట్టి భారత సైన్యం ఎన్ని హత్యలు, అరాచకాలు, అత్యాచారాలకు, వేధింపులకు పాల్పడుతున్నా, ఆ జాతుల ప్రజలు రక్తాలు చిందిస్తూ పోరాడుతూనే ఉన్నారు. వాళ్లను వాళ్ల ఆకాంక్షలు నిత్యం పోరాడేలా చేస్తున్నాయి. అలాగే 1967 నాటి నక్సల్బరీ పోరాట కాలం నుంచి ఇప్పటి వరకు మన దేశంలో 'దున్నే వారికే భూమి' నినాద స్ఫూర్తితో దాదాపు 15 వేల మంది భూమి కోసం పోరాడి అసువులు బాసారు. వీరిలో అధికశాతం ఆదివాసీలు, దళితులు, పేద రైతాంగమేనన్నది గుర్తు పెట్టుకోండి. లాల్‌గఢ్ నుంచి సూర్జాగఢ్ వరకు విశాల అటవీ, మైదాన ప్రాంతాలలో పోరాడుతోన్న విప్లవ ప్రజా పోరాటాలను అణచడానికి 1970ల నాటి తొలి ఆపరేషన్ 'స్టెపుల్‌చేజ్' నుండి గత ఆరేళ్లుగా సాగుతోన్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ వరకు పోలీసు, అర్ధసైనిక బలగాలు ఎన్నెన్ని అణచివేత అభియాన్‌లను, మహా అభియాన్‌లను చేపట్టి ఎందరెందరి ప్రాణాలను తోడేసినయో మీరే వాస్తవాలను చెప్పగలరు. పోరాట లక్ష్యం కోసం ప్రాణాలను బలిపెడుతున్న వారిలో మీ బంధు-మిత్రులు అనేకులు ఉండి ఉంటారు. నిజానికి మీరు ఒడిగడుతున్న ఇన్ని హత్యలు, అత్యాచారాల వెనుక గల శక్తుల దోపిడీ, స్వార్థం, అధికార తహతహను మీరు అర్థం చేసుకుంటే శేష జీవితంలో మీరు ఎన్నడూ ఖాకీ బలగాల్లో చేరకూడదనీ, చేరి పొరపాటు చేశామనీ తప్పక గుర్తిస్తారు.

మీరు ఈ దేశంలో ఎవరి సేవకు అంకితమయ్యారో ఎప్పుడైనా స్థిమితంగా కాసేపు ఆలోచించారా! అవినీతి కుంభకోణాలలో నిండా మునిగిన రాజకీయ నాయకులకు, వారిని అనుక్షణం అంటకాగే అత్యున్నత అధికారగణంకు, వారిని నీడలా అంటిపెట్టుకొని ఉండే నేర ప్రపంచానికి మీరు సలాంలు కొడుతూ గులాముల్లా బతుకుతున్నారు. నిన్నటివరకు దేశాన్ని పదేళ్లు పాలించిన ప్రధాని మన్మోహన్ బొగ్గు నిల్వల కుంభకోణాల్లో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి. కేంద్రంలో మంత్రి పదవులు వెలగబెట్టిన ఎ. రాజా, సురేష్ కల్మాడిలతో సహా అనేక మంది మంత్రులు అలాగే ముఖ్యమంత్రులుగా వెలుగొందిన లాలూ ప్రసాద్, మధుకోడా, యదియురప్పల్లాంటి దిగ్గజాలు, కణిమోనీ లాంటి పార్లమెంటేరియన్‌లను మీరు రక్షించాలి. 2002లో గుజరాత్‌లో మారణహోమాన్ని సృష్టించి 3 వేల మందిని నిలువునా కాల్చి చంపి లక్షలాది మందిని రాష్ట్రం వదిలి పారిపోయేలా చేసిన నేటి దేశ ప్రధాని మోదీ ఎంతటి ఘరానా హంతకుడో ఆలోచించండి. ఇప్పుడు మోదీ 'మేక్ ఇన్ ఇండియా' అంటూ దేశదేశాలు తిరుగుతూ మన దేశ వనరులను, ప్రపంచ మార్కెట్‌లో అమ్మకానికి పెడుతున్నాడు. దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టుపెడుతున్నాడు. ఆయన 'అభివృద్ధి, అభివృద్ధి

అంటూ' అరుస్తున్నదంతా ఘరానా కార్పొరేట్ సంస్థల అభివృద్ధియే. కాకపోతే పేదప్రజల అభ్యున్నతి పట్ల మొసలి కన్నీరు కారుస్తూ కాకమ్మ కథలు వినిపిస్తూంటారు. అందుకే ఆయనను అమెరికా అధ్యక్షుడు ఒబామా, కెనడా ప్రధానమంత్రి స్టీఫెన్ హార్పర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హొలాండే, జర్మనీ అధ్యక్షురాలు ఏంజెలా మెర్కెల్ లాంటి సామ్రాజ్యవాద దేశాల మహానేతలు తెగమెచ్చుకుంటున్నారు. వారిని సంక్షోభ సుడిగుండంలో నుండి గట్టెక్కించడానికి లక్షల కోట్ల డాలర్లు మన దేశానికి పెట్టుబడులుగా తీసుకురావడమే 'మేక్ ఇన్ ఇండియా' అసలు ఉద్దేశ్యం. 'మేక్ ఇన్ ఇండియా', స్మార్ట్ సిటీ, జన్‌ధన్ లాంటి ప్రధాని పథకాలన్నీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోన్న సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలను ఈడేర్చడానికేనన్నది గ్రహించండి, మన దేశంలోని 65 శాతం యువతను వారికి దాసోహం చేయడానికే మేక్ ఇన్ ఇండియా కుట్ర పన్నిందన్నది అర్థం చేసుకోండి. ఈ నేపథ్యంలో మీ సేవలు కూడా వారికే అంకితమవుతాయి. వారికి మీ తుపాకులు రైతుల భూములను సమకూర్చాల్సి ఉంటుంది. ఇంకా అనేక సేవలు నిస్సిగ్గుగా చేయవలసి ఉంటుంది. అందుకు మీరు సిద్ధమవుతారా? ఆలోచించండి.

దేశ ప్రధాని మోదీ మాతృసంస్థ హిందూ మతోన్మాద సంఘ్ ముఠా దేశంలో మున్నెన్నటికన్నా తీవ్ర స్థాయిలో ఆదివాసీలకు, దళితులకు, అనేక అల్ప సంఖ్యాక మతాలకు అతి ప్రమాదకరంగా మారింది. 70 ఏళ్ల ముసలి క్రైస్తవ సన్యాసినిని(నన్) సైతం వదలకుండా అత్యాచారానికి గురిచేయడం, మదర్ థెరిస్సాను అవమానించడం, క్రైస్తవ చర్చీలను ధ్వంసం చేయడం, ప్రత్యేకించి గొడ్డు మాంసాన్ని నిషేధించి కింది కులాలను, కష్టజీవులను ప్రతిబంధాలకు గురిచేస్తూ అవమానించడం, ముస్లింలను నానా విధాలుగా అపహాస్యం చేస్తూ బహిరంగంగా దాడులకు దిగడం మీరూ చూస్తున్నారు. ఇలాంటి నీచులకు మీరు సేవలు చేయడం ఎంత మాత్రం భావ్యం కాదు. మనుషుల మధ్య గల ఆత్మీయ సంబంధాలను, సామాజిక అనుబంధాలను మతోన్మాదంతో మంటగల్పడాన్ని మీరు ఖచ్చితంగా వ్యతిరేకించండి. అమెరికాలో చాలా కాలంగా ఆఫ్రికా నల్లజాతీయులను శ్వేత అహంకారంతో నిత్యం అవమానిస్తున్నది, హత్యలు చేస్తున్నది, న్యాయం నుంచి వంచిస్తున్నది, రెండవ శ్రేణి పౌరులుగా చూడడం మీరూ చూస్తున్నారు కదా! యూరప్‌లో మోదీ లాంటి కరుడుగట్టిన మితవాదశక్తులే అధికారాన్ని ఫ్రాన్స్, కెనడాలలో వెలగబెడుతున్నాయి. మన దేశంతో సహా ప్రపంచమంతా తీవ్ర కల్లోల భరితంగా ఉంది. దీన్ని మీరు అర్థం చేసుకొని ఖాకీ బతుకులకన్నా స్వతంత్రంగా, ప్రజల్లో ఒకరిగా బతకడం మేలని గుర్తించండి.

పోలీసులారా! అర్థసైనిక బలగాల్లారా!

గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను పాలకవర్గాలు ప్రారంభించాకే మావోయిస్టు గెరిల్లాల చేతులలో గడచిన ఆరేళ్లలో దాదాపు 400 మంది కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు మృత్యువాతపడ్డాయనీ ఇటీవలే మీ డిజిపి ప్రకాశ్ మిశ్రా లెక్కలు వల్లించాడు. యంపివిలు మీ రక్షణకు ఎంత మాత్రం పనికి రావు సరికదా అవి మిమ్ములను పెద్ద సంఖ్యలో మృత్యు ముఖంలోకి నెడుతున్నాయనీ బిఎస్ఎఫ్ మాజీ డిజి ప్రకాశ్ సింగ్ లాంటి వాళ్లు విశ్లేషిస్తున్నారు. ఓజిహెచ్ ప్రారంభమయ్యాక రెండేళ్లలోపు దాదాపు 50 వేల మంది మీ సోదర పోలీసులు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారనీ పరిశోధకులు వెల్లడిస్తున్నారు. తాజాగా 2013లో అర్ధ సైనిక బలగాలకు చెందిన 4,186 మంది తమ ఉద్యోగాలకు స్వస్తి చెప్పగా 2014లో ఈ సంఖ్య 68 శాతం పెరిగి 6,700 మంది ఉద్యోగాలు వదిలారు. ఇక మీరు ఆత్మహత్యలకు పాల్పడుతున్న లెక్కలు గానీ, మీలో మీరు ఒకర్ని ఒకరు కాల్చి చంపుకునే ఘటనలు గానీ, అణచివేత, దౌర్జన్యం భరించలేక మీరు మీ ఉన్నత అధికారులను హతమార్చడం లాంటి ఘటనలు కానీ లెక్కిస్తే మీరు ఎంతటి తీవ్ర ఒత్తిళ్ల మధ్య పని చేస్తున్నారో మీకు సులువుగానే బోధపడుతుంది. ఇక మీ అనారోగ్యాలు అంటారా! తీవ్ర మానసిక ఒత్తిళ్ల మధ్య విధులను నిర్వర్తించలేక ప్రాణాలను నిలువునా తోడేసుకుంటున్న మీ హత్యలు, ఆత్మహత్యల కన్నా జబ్బులతో మరణిస్తున్న వారి సంఖ్య అనేకరెట్లు ఎక్కువ ఉంది. మీరు మీ అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి గురి అవుతున్నారు. వారు మిమ్మల్ని ఎన్నడైనా కనీసంగా మనుషులుగానైనా గుర్తిస్తారా ఆలోచించండి. మీ పరిస్థితులు ఏ మాత్రం బాగులేవనీ కొంతమంది పాత్రికేయులు మీ జీవితాల్లోకి తొంగిచూసి బహిర్గతం చేస్తున్న చేదు నిజాలు ఎంత భయంకరంగా ఉన్నాయో మీడియాలో వస్తున్న అనేక వార్తల ద్వారా అర్థం చేసుకోండి. కనీసం బహిర్భూమికి వెళ్లే అవకాశాలైనాలేక రోజూ మీరు మీ క్యాంపులలో ఎన్ని అవస్థలు పడుతున్నారో ఆలోచించండి. మీకు ఎందుకు ఈ పరిస్థితులు దాపురించాయి. ఇంకెంత కాలం ఈ నికృష్ట పరిస్థితులలో అంగలారుస్తారు. మీ అధికారుల, లుచ్చా రాజకీయ నాయకుల మోసాలకు ఇంకా బలవుతారా! వద్దు. ఇంకెంతమాత్రం వద్దు. మీ పిల్లా పాపలకు, తలిదండ్రులకు తెలవనంత దూరంలో ఒంటరితనంతో నిర్వేదంగా జీవించడానికి స్వస్తి చెప్పండి. మీ ఇండ్లల్లో పెళ్లిళ్లయినా, మరణాలైనా, పండుగలైనా, పబ్బాలైనా బంధుమిత్రులతో హాయిగా గడిపే కొద్ది రోజుల కోసం మీరు ఎంత తహతహలాడుతుంటారో మీ దుర్భర జీవితాల్లోని చేదు జ్ఞాపకాలే మీకు చెప్పాలి. ఈ దయనీయమైన, హేయమైన ఉద్యోగాలకు స్వస్తి చెప్పండి. మీరూ విప్లవోద్యమంలో భాగం కండి!

భూముల కోసం పోరాడుతున్న రైతులతో భుజం-భుజం కలపండి. ఉద్యోగాల కోసం పోరాడుతున్న కార్మికులతో మమేకం కండి. అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడుతున్న విశాల ప్రజలలో భాగమై మీరూ పోరాడండి. మహిళల పట్ల అత్యాచారాలకు వ్యతిరేకంగా నడుం బిగిస్తున్న మహిళల పక్షం వహించి వారి న్యాయపూర్ణ డిమాండ్లను సమర్థించండి, ఈ దేశంలో మీరు తప్ప పోరాడనిది ఎవరు? నరేంద్ర మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్‌ల కుట్రలకు, కుహకాలకు బలికాకండి! మోదీ రసవత్తర ఉపన్యాసాలకు, ఆప్ పార్టీ ఆకర్షణీయ సంస్కరణలకు మోసపోకండి! ఖాకీ బతుకులు వద్దని కదనరంగంలో చేరి ప్రజా పోరాటాల్లో భాగం పంచుకోండి. మా విప్లవోద్యమం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయండి, తెలుసుకోండి. మా పిఎల్‌జిఎను ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవకు అంకితం కండి! మమ్ములను ప్రజలు ప్రేమిస్తున్నారు. మిమ్మల్ని ప్రజలు ద్వేషిస్తున్నారు. మా గెరిల్లాలను ప్రజలు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. మీ ఉనికినే ప్రజలు అసహ్యించుకుంటున్నారు. మా అమరత్వంపై రెండు కన్నీటి చుక్కలను వారు రాలుస్తున్నారు. కానీ మీ మరణం ఈక కన్నా తేలికైనదిగా మారింది. అందుకే ప్రభుత్వాలు మీ శవాలపై కోట్ల రూపాయిలు కప్పుతున్నాయి. ఇకపై మీరు ఆ కాసులకోసం కక్కుర్తి పడకండి. బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి అవార్డుల కోసం ఎగబడకండి. ఈ మధ్యే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపుర్ జిల్లాలో మిచ్చా వెడద అనే పోలీసు తన భార్యా బిడ్డలతో వచ్చి ప్రజల ముందు తన వ్యధ చెప్పుకొని వారి మధ్యనే బతికే అవకాశం ఇవ్వాలని కోరుకొని పోలీసు ఉద్యోగానికి తిలోదకాలు ఇచ్చాడు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఎందరెందరో ఎస్‌పిఒలు తుపాకులతో సహా వచ్చి ప్రజల ముందు లొంగిపోయింది మీకు తెలుసుకదా! కాబట్టి మీరు ఇంకెంత మాత్రమూ ఖాకీ జీవితాన్ని కొనసాగించవద్దు. మా పార్టీ నాయకత్వంలో దేశంలోని లక్షలాది ప్రజలు పోరాడి పంట భూములు సాధించుకున్నారు. సంవత్సరాల తరబడిగా పోరాడుతూ తమ ఇళ్లనూ, భూములనూ కాపాడుకుంటూ విస్థాపన వ్యతిరేక ఉద్యమాల్లో దృఢంగా పోరాడుతున్నారు. తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటున్నారు.

వారితో పాటు మీరూ జల్–జంగల్–జమీన్–ఇజ్జత్–అధికార్ అని నినదించండి.

ఒజిహెచ్ అంటే ప్రజలపై యుద్ధంగానే చెప్పుకోవాలి. ఈ యుద్ధం దేనికోసం నడుస్తోంది? మన దేశ వనరులను దోచుకోవడానికై తలపెట్టబడింది. దీనికి ముందు ఒకచోట సల్వాజుడుం, మరో చోట సేంద్ర, మరో చోట మరో పేరుతో వినాశకర విధ్వంసకర దాడులను దేశ పాలకవర్గాలు రకరకాల రియాక్షనరీ శక్తులతో నడిపించాయి. వారికి పూర్తి అండగా మిమ్ములను నిలిపాయి. ఆ 'సర్వం ధ్వంసం' దాడులలో ప్రజలు తమ నెత్తుర్లను చిందించి వాటిని తుదకు ఓడించారు. ఆ తర్వాత ఒజిహెచ్‌ను ముందుకు తెచ్చారు. మొత్తంగా ఒక దశాబ్ద కాలంగా వివిధ రూపాలలో సాగుతున్న ప్రజలపై యుద్ధంలో వెయ్యికి పైగా మీ భద్రతా బలగాలు కూడా మట్టికరిచాయి. అయినా పాలకవర్గాలు ఏనాటికానాడు కొత్త కొత్త రూపాలలో మిమ్ములను ఆధునీకరిస్తూ యుద్ధ చర్యలను తీవ్రం చేస్తున్నారు. వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఒక్క గడ్‌చిరోలి జిల్లాలోనే పోలీసుల కోసం 2014–15లోనే రూ.290 కోట్లు ఖర్చు చేసింది. ఇక ఛత్తీస్‌గఢ్ విషయానికి వస్తే గత 15 సంవత్సరాలలో మూడు రెట్ల పోలీసు బలగాలు పెరిగి వాటి సంఖ్య 72 వేలకు చేరింది. అదనంగా ఉన్న కేంద్ర బలగాలకు యేటా రూ. 2500 కోట్లు చెల్లిస్తున్నారు. ఇవన్నీ వారు ఉద్యమ ప్రాంతాలలోని వనరులను కొల్లగొట్టుకపోవడానికే చేస్తున్నారు. మే 9న దేశ ప్రధాని దేశంలోనే అత్యంత తీవ్రమైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా నిల్చిన బస్తర్‌కు వస్తున్నాడు. రావుఘాట్ రైల్వే లైన్, డిలిమిలిలో స్టీల్ ప్లాంట్, కిరందుల్‌లో గనుల విస్తరణ లాంటి పెట్టిబడిదార్ల లాభార్జిత కార్యక్రమాలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా తిరిగి సల్వాజుడుం–2కు తెరలేపుతున్నారు. ఇదెంత మాత్రం కాకతాళీయం కాదు. జీరంఘాటి పరిణామాలను క్షుణ్ణంగా తెల్సిన మీరు ఒజిహెచ్‌ను, సల్వాజుడుంలను గట్టిగా వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన నిలుస్తారనీ కోరుకుంటున్నాం. అలా కాకపోతే ప్రపంచ చరిత్రలో అంతిమంగా ఫాసిస్టులు వారి బలగాలు మట్టిగరిచిన విషయం భారత ప్రజా యుద్ధంలో మరోసారి నిరూపితమవుతుంది.

మే డే 2015

విప్లవాభివందనాలతో

అభయ్

Abhay

అధికార ప్రతినిధి

కేంద్ర కమిటి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు